అకాల వర్షానికి తడిసిన ధాన్యం

- టార్పాలిన్లు లేక రైతులు ఆగమాగం
- కళ్లముందే పంట తడుస్తున్నా ఏమి చేయలేని పరిస్థితి
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై అసహనం

జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం కురిసిన అకాల వర్షం రైతులను ఒకింత నష్టాల్లోకి నెట్టింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యంతో పాటు పొలాల్లో కుప్పలుగా ఉంచిన ధాన్యం, మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచకపోవడంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు.



కమలాపూర్ : తడిసిన ధాన్యాన్ని దోజర్‌తో కుప్ప చేస్తున్న రైతు



ఐనవోలు : తడిసిన మొక్కజొన్న



ధర్మసాగర్ : అకాల వర్షానికి తడిచిన ధాన్యం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో శనివారం అకాల వర్షం కురిసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా టార్పాలిన్లు లేకపోవడం వలన ధాన్యం పూర్తిగా తడిసిముద్దయ్యింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏలాంటి ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. తాలు పేరుతో ధాన్యాన్ని తూకం వేయకుండా ఆలస్యం చేయడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. కాగా వాతావరణం చల్లబడడంతో ఎండవేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిముద్దైంది. కొందరు రైతులు వాతావరణాన్ని గమనించి, అకాల వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికతో అప్రమత్తమై ధాన్యంరాశులపై టార్పాలిన్లు కప్పుకొని ధాన్యాన్ని కాపాడుకున్నారు. ఐనప్పటికీ కొంత మంది రైతులకు చెందిన ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఉదయం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలో, పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. చాలా మంది రైతులు సకాలంలో టార్పాలిన్లు కప్పి ధాన్యాన్ని రక్షించుకున్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలో శనివారం కురిసిన అకాల వర్షానికి వివిధ గ్రామాల్లోని ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసిముద్దయ్యాయి. ఉన్నపలంగా వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. పంటను రక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కొందరు రైతులు టార్పాలిన్లు కప్పి రక్షించుకున్నారు.

టార్పాలిన్లు లేక ధాన్యం తడిచింది



గ్రామంలోని రైతులందరూ ఒకేసారి కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అయితే శనివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం కుప్పలపై కప్పేందుకు సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో ధాన్యం తడిసిపోయింది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.

\- తోకల మల్లారెడ్డి, ధర్మసాగర్

రాజక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



రాజక్కను పరామర్శిస్తున్న నాయకులు

శాయంపేట : ఆర్టీసీ బస్సు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కావటి రాజక్క కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజక్కను శనివారం ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూ.2వేలు ఆర్థికసాయం అందించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వలన ప్రమాదం చోటుచేసుకుని రెండు కాళ్లు కోల్పోయి ప్రాణపాయ స్థితితో ఉందని తెలిపారు. ప్రమాదం జరిగి 8 రోజులు గడుస్తున్నా ఎమ్మెల్యే సత్యనారాయణరావు, అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఆర్టీసీ అధికారులు స్పందించి రాజక్క కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్, కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు పురుషోత్తం, సాయికిరణ్, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకు పాస్టర్ల మద్దతు



రేవూరిని సన్మానిస్తున్న పాస్టర్స్

పరకాల : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు ప్రకటిస్తున్నట్లు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 26 మంది పాస్టర్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు సోదా రామకృష్ణ ఆధ్వర్యంలో పాస్టర్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు ప్రకటించారు.

పిడుగుపాటుతో గొర్రెల మృతి

ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామంలో శనివారం పిడుగుపాటుతో నాలుగు గొర్రెలు, ఒక మేక మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం గ్రామానికి చెందిన గడ్డం ఐలయ్య తన గొర్రెలు, మేకలను ఓ కొట్టంలో ఉంచాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఉరుములతో కురిసిన వర్షానికి గొర్రెల కొట్టంపై పిడుగు పడింది. దీంతో నాలుగు గొర్రెలు, ఒక మేక అక్కడికక్కడే మృతి చెందాయి.

సమన్వయ కమిటీ ఏర్పాటు

వేలేరు : కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటీని ఎమ్మెల్యే శ్రీహరి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇందిరా ప్రకటించినట్లు మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా సమ్మిరెడ్డి, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, రాంగోపాల్ రెడ్డి, కత్తి సంపత్, బిల్లా యాదగిరి, లక్ష్మణ్ నాయక్, రాజిరెడ్డి, మధు, రాంచందర్, దేవేందర్‌రెడ్డి, సంపత్‌ను నియమించినట్లు తెలిపారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా : అరూరి

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. మూడోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీనే అని జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పది సంవత్సరాలుగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రానికి రైలు సదుపాయం రావాలంటే బీజేపీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మొద్దని, ఆ పార్టీలు మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు అమలు చేయడంలో విఫలం అయ్యిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తనేని ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, మండల అధ్యక్షుడు గడ్డం రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి రామకష్ణ, నాయకులు విద్యాసాగర్, దేవరాజ్, రాజు, నాగరాజు, చంద్రమౌళి, నవీన్, మల్లారెడ్డి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

బస్సెక్కాలంటే ఎండలో నిల్చోవాల్సిందే

- గుడెప్పాడ్‌లో బస్‌షెల్టర్ కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ జాతీయ రహదారికి ముఖ్య కూడలి. ఈ జంక్షన్ మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. ఈ మార్గంలో హనుమకొండ నుంచి పరకాల, భూపాలపల్లి, ములుగు, ఏటూరు నాగారం వైపు ఆర్టీసీ బస్సులు వెళ్తుంటాయి. నిత్యం వందలమంది ప్రయాణికులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అయితే ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండలు మండుతున్నా రోడ్డు మీద నిలబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. రాత్రి వేళల్లో మహిళా ప్రయాణికులకు దొంగలు, ఆకతాయిలతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే 40 ఏళ్ల క్రితం బస్‌షెల్టర్ నిర్మించారు. కానీ అది శిథిలావస్థకు చేరడంతో రోడ్డు విస్తరణలో దాన్ని తొలగించారు. ఈ మార్గంలో నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు రాకపోకలు కొనసాగిస్తున్నా ఈ సమస్య వారికి కనిపించడం లేదా అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలని, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిపిన ఆర్టీసీ బస్సు

ఎండలో మగ్గుతున్నాం



గుడెప్పాడ్‌లో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎండలో, వర్షంలో నిల్చొని బస్సుల కోసం వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలి.

\- బైగాని కృష్ణమూర్తి, ప్రయాణికుడు

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

ఐనవోలు : పురుగులమందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన కాసుకొండ బాలరాజు(32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత సంవత్సరం బాలరాజు కుమారుడు అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. కూతురు వైష్ణవికి చిన్నప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేదు. వీటికి తోడు రెండు నెలల క్రితం తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. కాగా 10 రోజుల క్రితం తన తండ్రికి పక్షవాతం వచ్చింది. కుటుంబంలో ఇన్ని కష్టాలు వచ్చాయని బంధువులతో చెప్పుకుని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ బాధలు తట్టుకోలేకపోతున్నానంటూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామ శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు బాలరాజును ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గైకడి అనిల్‌కుమార్ తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

వేలేరు : పిడుగు శబ్దానికి తాటిచెట్టుపై నుంచి పడి గీతాకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. ముంజ కుమారస్వామి వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నాడు. ఈ క్రమంలో సమీపంలో పిడుగుపడటంతో ఆ శబ్దానికి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో అతనికి గాయాలుకాగా స్థానికులు 108కి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల పోశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతని కుటుంబ పరిస్థితిని చూసి చలించిన గ్రామంలోని కొంత మంది దాతలు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. తలోకొంత పోగుచేసి రూ.21,600 జమచేసి శనివారం బాధిత కుటుంబానికి అందించారు. సామాజిక సేవకులు అమ్మ అశోక్, కోగిల భిక్షపతి, కోగిల కిరణ్, నాగేల్లి సురేష్, కోగిల రమేష్, కోగిల పద్మ, శిరీష, సర్దార్‌తోపాటు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ కోర్టులో ఐరన్ పోల్స్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండలంలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారుతుండడంతోపాటు మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టులో ఐరన్ పోల్స్‌ను తొలగించడంపై సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'క్రీడా మైదానాలకు గ్రాహణం' కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి శనివారం వాలీబాల్ కోర్టులో ఐరన్ పోల్స్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక యువకులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం పట్టివేత

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పైసా నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. నర్సయ్య బెల్టుషాపులో రూ.5 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

గురుకుల ఫలితాల్లో 19 మంది అర్హత

శాయంపేట : ఇటీవల జరిగిన తెలంగాణ గురుకుల (వీజీటీ) సెట్-2024 ప్రవేశపరీక్ష ఫలితాలలో మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలకు చెందిన 17మంది విద్యార్థులు సీట్లు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ప్రిన్సిపాల్ మామిడి పృథ్వీ తెలిపారు. ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు 26మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా అందులో షణ్ముఖ, శ్రీహర్షిని, అక్షిత, హారిక, శ్రుతి, అనూ, వైష్ణవి, అభిజ్ఞ, బిందుశ్రీ, వరుణ్, నవతేజ్, సాయిహర్ష, వరుణ్‌తేజ్, వర్షిత్, మోక్ష, నవ్యశ్రీ, హర్షని సీట్లు సాధించినట్లు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను, ప్రత్యేక శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ అనురాధ అభినందించారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు యాకర నవ్యశ్రీ, ఆకులపల్లి బేబీ మడికొండ గురుకులంలో 5వ తరగతిలో అర్హత సాధించారు. ఈ మేరకు శనివారం పాఠశాల హెచ్‌ఎం చుంచుకాల లింగారావు విద్యార్థినులను అభినందించారు. చదువులో ముందుండి మంచి మార్కులు సాధించి ఉన్నతంగా ఎదగాలని ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షులు మాచర్ల బాలకిషన్, కూసూరు రాజయ్య, సభ్యులు వీరగాని ప్రకాశ్, రంజిత్, బక్కయ్య, పోషాలు, సైకిలాబ్, కరుణాకర్, కుమారస్వామి, తిరుపతి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పాలా కాపాడుకుంటానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వైద్యుల వెంకటరాజు రెడ్డి, ప్రధానకార్యదర్శి ఐరబోయిన రాజు, ఎంపీటీసీ ఐలయ్య, జంగారెడ్డి, వలిహైదర్ పాల్గొన్నారు.

సఖి సేవలు వినియోగించుకోవాలి



శాయంపేట : మహిళలతో మాట్లాడుతున్న వినీల



ఆత్మకూరులో..

శాయంపేట : సఖి కేంద్రం అందించే సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని సఖి టీం కేస్ వర్కర్లు వినీల, హరిత అన్నారు. మండల కేంద్రంలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ కేంద్రం అందించే సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలు, మహిళలపై జరుగుతున్న లైగింక వేదింపుల నివారణకు ప్రత్యేక చట్టాల ఉన్నాయని, వాటిని వియోగించుకోవాలని సూచించారు. గృహహింస, లైంగిక వేదింపులు, ఇతర సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181, ఫోన్ నెంబర్ 0870-2452112కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మహిళా రక్షణ చట్టం, గృహహింస నిరోధక చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సఖి కేసు వర్కర్లు వినీల, హరిత అన్నారు. మండలంలోని తిరుమలగిరిలో శనివారం సఖిసెంటర్ అందించే సేవలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. బాలికలు, మహిళలు హింసలను, వేదింపులను ఎదుర్కొనే మహిళలకు రక్షణ కల్పించి న్యాయం చేసేందుకు సఖి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధిత మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 181, 0870-2452112 ఫోన్ చేస్తే సాయం అందిస్తామని అన్నారు. మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్ శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

ఎల్కతుర్తి : కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఐదేళ్లు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐదేళ్లు పనిచేసిన బోయినపల్లి వినోద్‌కుమార్ జిల్లాకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, గృహజ్యోతి పథకం అమలు చేసి 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించినట్లు తెలిపారు. తెల్లరేషన్‌కార్డుదారులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.1,089కోట్లు చెల్లించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా వారి ఉసురు తీసిందని, కాంగ్రెస్ హయాంలో సకాలంలో వేతనాలు అందిస్తున్న విషయం మర్చిపోవద్దని అన్నారు. మాయమాటలు చెబుతూ ఓట్లు పొందే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమికాదన్నారు. ప్రజలు బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా ఓట్లు పొందే రాజకీయాలు మానుకోవాలని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, నాయకులు సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, గొర్రె మహేందర్, శీలం అనీల్, రమేష్, రత్నాకర్, శ్రీకాంత్, రవి, కడారి సురేందర్, గుడెల్లి నవీన్ పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కమలాపూర్ : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని, మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీని, రెండోసారి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కమలాపూర్ మండలం నుంచి అత్యధిక మెజారిటీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మండల ఇన్‌చార్జ్ కానుకుంట్ల రంజిత్‌కుమార్, నాయకులు భోగి భిక్షపతి, జనగాని కుమారస్వామి, బండి సంపత్‌కుమార్, తుమ్మల నరేష్, పెండ్యాల ప్రభాకర్‌రెడ్డి, అరవింద్, కుమార్, రమేష్, పాక కుమారస్వామి, నరిగె ఓదెలు, బోయిన సుభాష్, బుర్ర కరుణాకర్, సదానందం, రమేష్, రామస్వామి, కల్యాణ్, ఉదయ్, మొగిలి పాల్గొన్నారు.

మే 20లోపు పనులు పూర్తిచేయాలి

శాయంపేట : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మే 20వ తేదీలోపు పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి భద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు మే 20లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంఈఓ రమాదేవి, ఐకేపీ ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భద్రునాయక్

వాహనాల తనిఖీ

పరకాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. హనుమకొండ నుంచి హుజూరాబాద్, భూపాలపల్లి వైపు వెళ్లే వాహనాలను ఎస్సై రమేష్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.